క్లుప్తంగా

శాకంబరిగా నవదుర్గ



శాకంబరీదేవిగా దర్శనమిస్తున్న నవదుర్గ అమ్మవారు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవ దుర్గ అమ్మవారు శాకంబరీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రామాయణం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని 15 రకాల కూరగాయలతో అలంకరించారు. ఏటా ఆషాడమాసంలో మూడు రోజుల పాటు అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిస్తారని అర్చకులుతెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ఎరకయ్య

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంఈఓ–2 బి.ఎరకయ్య నిర్వా హకులకు సూచించారు.ఆమదాలవలస కాలనీ ప్రాథ మిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యా ర్థుల హాజరు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. ఈసందర్భంగా వంట నిర్వాహ కులకు ఆయన పలు సూచనలు చేశారు. వంటకాలపై మూతలు పెట్టాలని, కాచి, చల్లార్చిన నీటిని పిల్లలకు ఇవ్వాలని చెప్పారు. ఎంఈఓ వెంట హెచ్ఎం పాలవలస రమేష్‌కుమార్ ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

బాడంగి: తమ గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మండలంలోని గబదవలస గ్రామానికి చెందిన గిరిజనులు సీపీఎం కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుధాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని శ్మశాన వాటిక, ప్రభుత్వ భూములను కొందరు పెత్తందారులు ఆక్రమిస్తున్నారని, ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. శ్మశాన వాటికకు హద్దులు నిర్ధారించి, గ్రామం నుంచి సిమెంట్ రోడ్డు వేయాలని, వీధి రోడ్లు వేయాలని, ప్రభుత్వ భూమిని పేదలకు పంచి పెట్టాలని అభ్యర్థించారు.

ఉపాధి వేతనాలు ఇవ్వండి మహాప్రభో



వేతనాలు చెల్లించాలని కోరుతున్న వంగపండువలస మహిళలు

రామభద్రపురం:నెలల తరబడి కష్టపడి చెరువు పనులు చేశాం. వేతనాలు ఇవ్వండి మహాప్రభో అని మండలంలోని వంగపండు వలసకు చెందిన వేతనదారులు వేడుకుంటు న్నారు. పలువురు మహిళా వేతనదారులు బుధవారం సాక్షి వద్ద తమ గోడు వెల్లబోసు కున్నారు. ఆరు వారాలకు సంబంధించిన వేతనాలు జమకాలేదని తెలిపారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమలాంటి వారికి ఉపాధి పనులు చేసిన తర్వాత ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు జమ చేయకపోతే కుటుంబ పోషణ సాగేదెలా అని ప్రశ్నించారు. వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు జమ చేయాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



వరినాట్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ శ్యామ్‌సుందర్

బొబ్బిలిరూరల్: మొక్కజొన్న, వరి పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. పారాది గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో సమావేశమై మొక్కజొన్న,వరి సాగులో ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులు వరి నాట్లు వేయడాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నారు చిగుళ్లను తుంచి నాటుకోవాలని రైతులకు చెప్పారు. వీఏఏ ఉష , తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమే..

- అధికారంలో ఉంటే సంక్షేమం అందిస్తాం
- ప్రతిపక్షంలో ఉంటే ప్రజాగొంతుకై నిలదీస్తాం
- కూటమి ప్రభుత్వాన్ని ప్రజాకోర్టులో నిలబెడదాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- బొబ్బిలిలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటుంది. అధికారంలో ఉంటే ప్రజా సంక్షేమం కోసం పథకాలు ఇంటింటికీ చేరుస్తాం. ప్రతిపక్షంలో ఉంటే ప్రజా గొంతుకై పాలకులను నిలదీస్తాం. ప్రజావాణిని వినిపించి ప్రభుత్వం మెడలను వంచి ప్రజాకోర్టులో నిలబెడతామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలి పట్టణంలోని సూర్య రెసిడెన్సీలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ' పేరిట కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ఇంటింట ప్రచారం చేద్దామని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

జగన్ ప్రజాసంక్షేమరాజ్యాన్ని నడిపారు

ప్రజా సంకల్పయాత్రతో ప్రజల మధ్యకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజావసరాలు తెలుసుకుని నవరత్నాలు అనే పథకాలు ప్రవేశపెట్టారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని సమర్థవంతంగా అమలు చేశారని జెడ్పీ చైర్మన్ గుర్తు చేశారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించారన్నారు. మేని ఫెస్టోను ఓ భగవద్గీత, ఖురాన్,బైబిల్‌లా తలచి ప్రజాసంక్షేమ రాజ్యాన్ని నడిపించారన్నారు. కానీ చంద్రబాబు నాయుడు కుయుక్తులతో తన మాట ప్రజలు నమ్మరని బీజేపీ, పవన్ కల్యాణ్‌లను తోడు తీసుకువచ్చి సూపర్ సిక్స్‌తో పాటు అనేక బూటకహామీలు, పథకాలు అమలు చేస్తామని బాండ్‌లు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారన్నారు. టీడీపీ హయాంలో మేని ఫెస్టో ఓ పుస్తకం మాత్రమేనన్నారు. రాజకీయాల్లోకి జగన్ వచ్చాక మేనిఫెస్టో అంటే ఓ పవిత్ర గ్రంథం అయిందన్నారు.

ఇది రద్దుల ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం స్పౌజ్ పెన్షన్లు (వితంతు)ఇస్తున్నామని జీఓ విడుదల చేసి చేతులు దులుపుకున్నారే తప్ప నేటికీ ఆ పెన్షన్లు ఎవరికీ అందలేదని జెడ్పీ చైర్మన్ అన్నా రు. సాక్షాత్తు మంత్రులు సంతకం చేసిన ఆ జీఓలే అమలు కాకపోతే ఈ ప్రభుత్వం ఇంకేం అమలు చేస్తుందని ప్రశ్నించారు. ఇది రద్దుల ప్రభుత్వమన్నారు. ఓసారి రద్దు చేయడం మరోసారి అదే రద్దుపై ఇంకో జీఓ ఇవ్వడం అలవాటైపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో భూరీసర్వే కార్యక్రమం చేపట్టినప్పుడు టీడీపీ నాయకులు చెడు ప్రచారం చేశారని, రీసర్వే పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి రైతుల భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే ఈ సర్వేను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక రీసర్వే అమలు కోసం మరో జీఓ విడుదల చేశారన్నారు. అలాగే తాటిపూడి జలాశయానికి కృషి చేసిన గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సూచించి జీఓ విడుదల చేస్తే ఆ జీఓను రద్దు చేశారన్నారు. దీనిపై జెడ్పీ సమావేశాల్లో, ప్రజల్లోనూ వ్యతిరేకత ఎదురైతే మళ్లీ మరొక జీఓ విడుదల చేసి ఆ పేరు మేమే పెట్టామని చెప్పడంలోనే టీడీపీ కూటమి ప్రభుత్వం తీరు తేటతెల్లమవు తుందన్నారు. ప్రజా సంక్షేమం, పథకాల అందజేత, అభివృద్ధిలో వైఎస్సార్‌సీపీ పోటీపడితే... కూటమి నాయకులు అవినీతి కోసం పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజాగొంతుకై నిలదీస్తుందని, ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా కోర్టులో దోషిగా నిలబెట్టడం ఖాయమని అన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎస్.వి.మురళీకృష్ణారావు, ఇంటి గోపాలరావు,వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు,తూముల రామ సుధీర్, ఏపీ ఆర్థిక మండలి మాజీ రాష్ట్ర సభ్యులు తూముల భాస్కరరావు, ఎంపీపీలు చొక్కాపులక్ష్మణరావు,శంబంగి లక్ష్మి, నర్సుపల్లి ఉమాలక్ష్మి,భోగి గౌరి, జెడ్పీటీసీలు సంకిలి శాంతకుమారి,అప్పికొండ సరస్వతి, పెద్దింటి రామారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గర్బాపు రామారావు, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి పట్టణ, మండల అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, తమ్మిరెడ్డి దామోదరరావు, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు బొమ్మి శ్రీనివాసరావు, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

చంద్రబాబుకు శాపం ఉంది



మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ మోసాల చంద్రబాబుకు నిజం మాట్లాడితే తల వేయిముక్కలవుతుందని, వెన్నుపోటుకు గురైన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు శాపం విధించినట్టుందన్నారు. అందుకే చంద్రబాబు ఎప్పుడూ అబద్ధాలు, ప్రజల్ని మోసం చేసే మాటలే ఆడతారన్నా రు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో 66 లక్షల మందికి పెన్షన్లు ఇస్తే, చంద్రబాబు అధికారంలోకి వచ్చి కోతలు విధించి 61లక్షల మందికి మాత్రమే ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లోమీడియాను వాడుకుంటోందని, మనకున్న మీడియాను కూడా గ్రామాల్లో ప్రసారం కాకుండా చేస్తున్నారన్నారు. అందుకే మనం మౌత్ పబ్లిసిటీ, సోషల్‌మీడియాను వినియోగించుకోవాలన్నారు. అన్ని పథకాలూ అమలు చేసేశామని, ఎవరైనా అడిగితే వారి నాలుక మందం కిందే లెక్క అనడం చంద్రబాబు నైజాన్ని తెలియజేస్తోందన్నారు.

క్వార్టర్‌కు రూ.10 చొప్పున ముడుపులు



మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందన్నారు. మద్యం వ్యాపారంలో స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయనకు క్వార్టర్ బాటిల్ వద్ద రూ.10 చొప్పున ముడుపులు ముడుతున్నాయన్న సమాచారం తన వద్ద ఉందని అన్నారు. చంద్రబాబు ఎప్పుడు గద్దెనెక్కినా అబద్ధాలు,మోసపూరిత పాలన మామూలేనన్నారు. తాము అధికారంలోకివస్తే విద్యుత్ ఛార్జీలను అవసరమైతే తగ్గిస్తాం తప్ప పెంచేది లేదని చెప్పారని, అధికారంలోకి వచ్చాక రూ.19,115 కోట్ల భారాన్ని ప్రజలపై వేశారన్నా రు. మరోసారి విద్యుత్‌ఛార్జీలు పెంచేందుకు ఇప్పటికే డిస్కంలు ప్రతిపాదించాయని తెలిపా రు. కూటమి అధికారంలోకివచ్చాక రోడ్లను బాగు చేయలేదని, కనీసం బేబీ నాయన గతంలో గుంతల వద్ద సెల్ఫీలు తీసుకున్నారని, కనీసం ఆ గుంతలనైనా కప్పలేదన్నారు. వీఆర్ఎస్ సాగునీటి ప్రాజెక్టు కాలువలు తుప్పలతో నిండిపోయినా తొలగించే పనులు చేపట్టలేదన్నారు.

పవన్ కనిపించకుండా పోయారు..

పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గతమంతా అబద్ధాలతో నెట్టుకొచ్చిన చంద్రబాబు నాయుడు గడచిన ఎన్నికల్లో అవే అబద్ధాలతో వెళితే ప్రజలు నమ్మరని పవన్ కల్యాణ్, బీజేపీతో దోస్తీ చేసి ప్రచారంలో పాల్గొన్నారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పవన్ కల్యాణ్‌ను పక్కన పడేశారన్నారు. ఎన్నికలయ్యే వరకూ పవన్‌ను ముందుంచిన చంద్రబాబు ఇప్పుడు వెనక్కు నెట్టడంతో కనిపించకుండా పోయాడన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

బాడంగి: ప్రజలకు అవసరమైన పనులను ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ సూచనల మేరకు చేపట్టాలని, ఈ పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తే మంచిఫలితాలొస్తాయని డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో తెర్లాం, బాడంగి మండలాల ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో చిన్న,సన్నకారు రైతులను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా వారికి అవసరమైన పనులను చేపట్టాలన్నారు. కేవలం వేసవిలోనే ఉపాధి పనులు చేపట్టడం కాకుండా ఏడాదిలో ఎప్పుడైనా పనులు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలంలో ఫారం పాండ్‌లు, వర్మీ కంపోస్టు పిట్‌ల నిర్మాణాలు, ఉద్యాన వన పంటలకు సంబంధించిన పనులను చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందరోజులు పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. బాడంగి, తెర్లాం ఏపీఓలు సాయిరాం,సుశీల, ఈసీలు హరినారాయణ, బుజ్జి, రెండు మండలాల టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పాన్‌షాపుల్లో తనిఖీలు



పాన్ షాపులో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

వంగర: ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ పేరుతో ఎం.సీతారాంపురం గ్రామంలోని పలు పాన్‌షాపుల్లో ఏఎస్ఐ పైడితల్లి, పోలీస్ సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. పదిమంది దుకాణదారులపై పెట్టీ కేసులు నమోదు చేశారు. విద్యా సంస్థలకు దగ్గర్లో ఉన్న పాన్‌షాపుల్లో సిగరెట్లు, గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులు అమ్మడం వల్ల విద్యార్థులు మత్తుకు బానిసంతున్నారని,వాటిని విక్రయించే షాపులకు జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఏఎస్ఐ తెలిపారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా కేసులు నమోదుచేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా బొత్స పుట్టినరోజు వేడుకలు

రాజాం: స్థానిక సూర్యదుర్గ ఫంక్షన్ హాల్‌లో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీని వాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీరాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కలిసి కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో...

బొబ్బిలి: పట్టణంలోని సూర్య రెసిడెన్సీలో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు,జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు.

బస్సు సర్వీసు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

బాడంగి: పార్వతీపురం డిపో నుంచి బొబ్బిలి మీదుగా భీమవరం, ముగడ, బాడంగి, కోడూరు, షికారుగంజి గ్రామాలకు పల్లె వెలుగు బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు మంగళవారం సాయంత్రం పునరుద్ధరించారు. గతంలో ఉన్న బస్సు సర్వీసు రెండు నెలల క్రితం నిలిచిపోవడంతో ప్రజలతో పాటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు పడుతున్న అవస్థలపై 'సాక్షి' పత్రికలో ఈనెల 5వ తేదీన 'నిలిచిన ఆర్టీసీ సర్వీసుతో అవస్థలు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసును పునరుద్ధరించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వండానపేటలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి రోహిణీరాఘవ్

రేగిడి: వండానపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద రేగిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు వందమందికి వైద్యాధికారి రోహిణీ రాఘవ్ వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిల్వలు ఉన్నా..పంపిణీ సున్నా..



యూరియా కోసం స్థానిక పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చిన రైతులు

రామభద్రపురం: మండల రైతులు ఎరువుల కోసం నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోఎక్కడో ఒకటో రెండు రైతుసేవా కేంద్రాల్లో కొద్దో గొప్పో యూరియా పంపిణీ చేశారు. కానీ మిగతా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల పంపిణీ చేపట్టడం లేదు.అదును దాటాక పంటకు ఎరువు వేస్తే సుఖమేముంది అని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి (పీఏసీఎస్) మూడు రోజుల క్రితం యూరి యా వచ్చింది. ఇంకా రైతులకు పంపిణీ చేయలేదు. రోజూ యూరియా కోసం పీఏసీఎస్ చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. బయట దుకాణాల్లో కూడా యూరియా దొరకడం లేదని, పీఏసీఎస్‌లో నిల్వలు ఉన్నా పంపిణీ చేయడం లేదని రైతులు మండిపడుతున్నారు. సమస్యపై పీఏసీఎస్ అధికారుల వద్ద సాక్షి ప్రస్తావించగా ఈనెల 7వ తేదీన పీఏసీఎస్‌కు 24 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, 8వ తేదీ సాయంత్రం వరకు డీబీటీ ఎకనాలెడ్జ్‌మెంట్ నంబర్ రాలేదని చెప్పారు.9వ తేదీన కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో తామంతా పాల్గొంటున్నామని, గురువారం నాటికి జిల్లా వ్యవసాయా ధికారులు డీబీటీ ఎకనాలెడ్జ్‌మెంట్ నంబర్ ఇస్తే యూరియా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

కదం తొక్కిన కార్మికులు



బొబ్బిలి: కలాసీ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ

దేశ వ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో బుధవారం సార్వత్రిక సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా అన్నివర్గాల కార్మికులు భారీ ర్యాలీలు, మానవహారాలు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని,కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఉపాధి వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, వీఆర్ఏలు, వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: రాజాంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు



బాడంగి: సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నాచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కూటమి మోసాలను ఎండగడదాం

- టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వివరిద్దాం
- రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

రాజాం: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకే 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రాజాంలోని సూర్య దుర్గ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ తలే రాజేష్ అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అతిథులుగా హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, పీఏసీ సభ్యుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి రాజేష్, ఇతర నాయకులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, పార్టీ కేంద్రపాలక మండలి సభ్యులు, దివంగత పాలవలస రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చారని, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని, ఇందుకోసం ఎలాంటి అనుమతు లు తీసుకోవాల్సిన అవసరం లేదని పార్టీ నాయకులకు సూచించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, హామీలపై గ్రామాల్లో కూటమి ఎమ్మెల్యేలు, నాయకులను ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, వచ్చే ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ ఒక్కరూ వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని, అన్ని స్థానాల్లో పోటీచేసి, సార్వత్రిక ఎన్నికలకు ముందే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయాన్ని తెరమీదకు తెద్దామని పిలుపునిచ్చారు.




సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు

పవన్ ఏం మాట్లాడతాడో తనకే తెలియదు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పుడు ఏం మాట్లాడతాడో తనకే తెలియదని జెడ్పీ చైర్మన్ ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలయ్యాయని అడిగితే తనకు పాలన చేతగాదని, పోరాటాలే అలవాటని అనడం హాస్యస్పదంగా ఉందని అన్నారు. హామీలు నెరవేర్చలేని సమయంలో పదవికి రాజీనామా చేసి, ప్రజల పక్షాన పోరాటం చేయలేకపోతున్న పవన్ కల్యాణ్ ఒక పార్టీకి అధ్యక్షుడినని చెప్పుకోవడం దురదృష్టకరమన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ఇంతవరకూ 15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వలేక, జనరల్ ఫండ్ జమచేయలేక చతికిలపడ్డాడని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.వి. సూర్యనారా యణ, పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ ఉపాధ్యాయ వింగ్ జిల్లా కార్యదర్శి మరిశర్ల గంగారావు, పార్టీ రాజాం పట్టణ, రూరల్, వంగర, రేగిడి మండలాల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్‌మోహనరావు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రాజాం జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంక టేష్, నక్క వర్షిణి, సర్పంచ్‌ల వింగ్ రాజాం కన్వీనర్ వాకముల్ల చిన్నంనాయుడు, జిల్లా కల్చరల్ వింగ్ కార్యదర్శి డాక్టర్ నరేంద్ర, పొట్నా సత్యనారాయణ గుప్త, న్యాయవాది రఘు, వైఎస్సార్‌సీపీ యాక్టివిటీ వింగ్ కార్యదర్శి సవలాపురపు రమేష్‌నాయుడు, తెర్లాం వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మహిళా విభాగం రాజాం వింగ్ కన్వీనర్ సామంతుల అరుణకుమారి, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, స్టూడెంట్‌వింగ్ రాజాం నియోజకవర్గ కన్వీనర్ రమేష్, పాలవలస శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేలు



కూటమి ప్రభుత్వంలో ప్రతీ నియోజకవర్గంలో 14మందికి పైగా షాడో ఎమ్మెల్యేలు ఉన్నారు. గతంలో రాజాం వచ్చిన చంద్రబాబు ఇక్కడ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేకు ఇద్దరు షాడో ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. ఇప్పుడు పాలకొండలో జనసేన ఎమ్మెల్యేకు 14 మంది షాడో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రతీ మండలంలోనూ ముగ్గురు నుంచి నలుగు రు కార్యకర్తలు తామే ఎమ్మెల్యేలమని చెప్పి అధికారులను బెదిరిస్తున్నారు. రాజాం నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే సోదరుడితో పాటు మరికొంతమంది షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారు. కూటమి అరాచకాలకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారి తరఫున పోరాడాల్సిన అవసరం, బాధ్యత మనందరిపై ఉంది.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

చంద్రబాబు అంటేనే మోసం



చంద్రబాబు అంటేనే మోసానికి మారుపేరుగా మారింది. ఆయన ఎప్పుడూ అబద్ధాలు మాట్లాడుతునే కాలం నెట్టుకొస్తున్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లాలి. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంతమేర నష్టపోయిందన్న విషయాన్ని వివరించాలి. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు ఇచ్చి అందులోని క్యూఆర్ కోడ్‌ను వారి స్మార్ట్ ఫోన్‌లో స్కాన్ చేయిస్తే కూటమి చేసిన మోసాలు ప్రజలకు తెలుస్తాయి.

– మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రైతులు విలవిలలాడుతున్నారు



కూటమి ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రోజుకో డ్రామా ఆడుతూ, డైవర్షన్‌పాలిటిక్స్ చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఊసరవెల్లి మాదిరి రంగులు మార్చి ప్రజలను మోసగిస్తున్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండానే చేసేశామని సీఎం అనడం హాస్యస్పదంగా ఉంది. తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో అమలు కాలేదు. మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవన్నీ ఎప్పుడు అమలుచేస్తారు.ఎరువులు లేక రైతులు విలవిలలాడుతున్నారని, అన్నదాత సుఖీభవ పథకం ఇంకా పెట్టుబడి సాయం అందించలేదు. వ్యవసాయం చేయలేక అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు.ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త గ్రామాల్లోకి వెళ్లి కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి. మీకు అండగా నేను ఉంటాను.

– డాక్టర్ తలే రాజేష్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్